సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



లాభాల బాటలో ఆర్టీసీ

చిత్తూరు రూరల్: ఆర్టీసీ ప్రస్తుతం లాభాల బాటలో దూసుకుపోతోంది. కోవిడ్ తరువాత పకడ్బందీ ప్రణాళికతో ఆదాయ మార్గాలను అన్వేషించిన ఆర్టీసీ మంచి ఫలితాలను సాధించిం. –8లో



15న టీటీడీ బోర్డ్ సమావేశం

తిరుమల: టీటీడీ పాలకమండలి సమావేశం శనివారం జరగనుంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	40	23
తిరుపతి	40	23
తిరుమల	36	20
గూడూరు	42	26
నగరి	41	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం(సా)	సహర్ శనివారం(ఉ)
తిరుపతి	6.29	4.39
చిత్తూరు	6.31	4.39
పుంగనూరు	6.32	4.42

న్యూస్‌రీల్

వినాయకుని హుండీ ఆదాయం రూ.కోటి



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి హుండీ ఆదాయం రూ.కోటి 7 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 15 రోజుల స్వామివారి హుండీ కానుకలను గురువారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించగా బంగారం 62 గ్రాములు, వెండి 2.85 కిలోలు, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏ 267 డాలర్లు, మలేషియా 6 రింగిట్స్, యూఏఈ 5దినార్లు, ఆస్ట్రేలియా 80 డాలర్లు, కెనడా 5 డాలర్లు, న్యూజీలాండ్ 480 డాలర్లతో పాటు స్వామివారి హుండీ కానుకల ఆదాయం రూ.1.07 కోట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవ రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీనివాస్, రవి, దేవస్థాన సిబ్బంది, కాణిపాక యూనియన్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసుశాఖకు ఉగాది పురస్కారాలు



బాబు ప్రసాద్, దిశా డీఎస్పీ, చిత్తూరు

చిత్తూరు అర్బన్:ఉమ్మడి జిల్లా పోలీసు, విజిలెన్స్, అగ్నిమాపక శాఖల్లో పనిచేస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలు వరించాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో మహోన్నత సేవా పతకం కింద చిత్తూరు దిశా డీఎస్పీ బాబు ప్రసాద్ ఎంపికయ్యారు. అలాగే ఉత్తమ సేవా పతకానికి తిరుపతి సూళ్లురుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డిని ఎంపిక చేశారు. సేవా పతకానికి చిత్తూరు జిల్లాలో శ్రీనివాసులు నాయుడు (చౌడేపల్లి సీఐ), నాగేంద్ర (కాణిపాకం హెడ్ కానిస్టేబుల్), భాస్కరయ్య (ఎస్ఆర్‌పురం హెడ్ కానిస్టేబుల్), తిరుపతి జిల్లాలో రామకృష్ణ (తిరుపతి సీఐడీ), ఆనంద్ (వెస్ట్ ఏఎస్ఐ), రవి (తిరుపతి ఆర్ఎస్ఐ), రామయ్య (బాలయ్యపల్లి హెడ్‌కానిస్టేబుల్), హలియమ్మ (తిరుచానూరు డబ్ల్యూ ఏఎస్ఐ), గోపాలకృష్ణ (తిరుపతి దిశ కానిస్టేబుల్), లావణ్య ప్రసాద్ (తిరుపతి విజిలెన్స్), రామస్వామి (పీలేరు ఫైర్‌మెన్), డేవిడ్‌సన్ (గూడురు ఫైర్ మెన్), చంద్రశేఖర్ (గూడురు డ్రైవర్ ఆపరేటర్) గిరిధర్ (తిరుపతి గార్డ్)ను ఎంపిక చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

జేసీ వెంకటేశ్వర్ రిలీవ్


చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ గా బదిలీ అయిన జేసీ వెంకటేశ్వర్ ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. నూతన జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటి వరకు కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఇన్‌చార్జి జేసీగా వ్యవహరించనున్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో అధికారికంగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 132వ జయంతి నిర్వహించనున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో వేడుకలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9.30 గంటలకు దర్గా సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాలంకరణ చేసి, నివాళులర్పించనున్నట్లు వివరించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ భవనం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటలకు అంబేడ్కర్ భవనంలో నిర్వహించే వేడుకలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్.కే.రోజా, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు.

నీకింత.. నాకింత

రేణిగుంట సమీపంలో ఓ రైస్ మిల్లులో బియ్యం వ్యాపారి రేషన్, నాసిరకమైన బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడు. రోజూ రెండు, మూడు లారీల బియ్యం దిగుమతి చేసుకుంటున్నాడు. దాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి 12 రకాల బ్రాండ్ల పేరుతో తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. లాభాల్లో అధికారులు కొంత.. వ్యాపారులు కొంత పంచుకుంటున్నారు. నకిలీ బియ్యం విక్రయాలపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలపై వ్యాపారులు అప్రమత్తమయ్యారు. సరుకును దాచేసి.. దాడులు చేయకుండా అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.



- నకిలీ బియ్యం వ్యాపారులు.. అధికారుల కుమ్మక్కు
- 'సాక్షి' కథనాలతో అప్రమత్తమైన అక్రమార్కులు
- నకిలీ బ్రాండ్ సరుకును దాచేసిన వైనం
- ఒకే మిల్లులో 12 రకాల నకిలీ బ్రాండ్ సంచులు
- బ్రాండింగ్ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో క్వాలిటీ వ్యాపారుల సైలెంట్

సాక్షి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నకిలీ బియ్యం వ్యాపారులు అప్రమత్తం అయ్యారు. నకిలీ బ్రాండ్ల సంచులు, నాసిరకం బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో దాచేశారు. ఏమీ తెలియనట్టు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి 'సాక్షి' కథనాలపై ఆరా తీస్తున్నారు. అధికారుల చర్యలు తీసుకోకుండా ఉండేందుకు మామూళ్లు పంపి ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాసిరకం బియ్యాన్ని బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్న వ్యాపారులపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం తెలిసిందే. తిరుపతి, చిత్తూరు నగరాలు కేంద్రంగా చేసుకుని నకిలీ వ్యాపారులు శ్రీకాళహస్తి, తిరుపతి, సత్యవేడు, చంద్రగిరి, గంగాధరనెల్లూరు, నగరి, పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లుల్లో ఈ దందా కొనసాగిస్తున్నారు. నకిలీ వ్యాపారులు నిల్వ ఉన్న పాతబడి మగ్గిపోయి ఉన్న బియ్యాన్ని వెతికి మరీ కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలా తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న నకిలీ వ్యాపారంతా వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మగ్గిపోయినవి, పక్కానికి రాని బియ్యాన్ని కొనుగోలు చేసి ఆహారంగా తీసుకుంటుండడంతో అనారోగ్యాల పాలవుతున్నారు. అయినా నాణ్యమైన బియ్యం విక్రయించే వారు ఫిర్యాదు చేయాల్సి ఉన్నా.. స్వలాభాపేక్షతో పట్టించుకోవడం లేదు. ఇంత దారుణం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. తనిఖీలు ఎందు చేయడం లేదని సంబంధిత అధికారులను అడిగితే 'మాకు ఫిర్యాదులు అందలేదు' అని చెప్పి తప్పించుకుంటున్నారు. అధికారులు స్పందించి నకిలీలపై కొరడా ఝుళిపించి.. ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మేలు చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

లొసుగులే అక్రమార్కులకు వరం

జిల్లాలో నకిలీ బియ్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నా క్వాలిటీ బియ్యం విక్రయించే వారు ఫిర్యాదు చేయాల్సి ఉన్నా.. స్వలాభాపేక్షతో పట్టించుకోవడం లేదు. క్వాలిటీ బియ్యం అమ్మే వ్యాపారి బ్రాండ్‌కు రిజిస్ట్రేషన్ ఉండడం లేదు. ఆ బ్రాండ్‌ని రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వానికి 5 శాతం టాక్స్ కట్టాలి. ఈ టాక్స్ కట్టడం ఇష్టం లేక ఆ వ్యాపారి 26 కిలోల బియ్యం బస్తాలతో విక్రయాలు సాగిస్తున్నాడు. ఇదే బ్రాండ్ పేరుతో నకిలీలతో విక్రయాలు సాగుతున్నా. నాణ్యమైన బియ్యం విక్రయించే బ్రాండ్ వ్యాపారి అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సాహసించలేకపోతున్నాడు. ఈ లొసుగులను అవకాశం మలచుకుని నకిలీ బియ్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> నకిలీ బియ్యం వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. విజిలెన్స్, తూనికలు కొలతలశాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. నకిలీ వ్యాపారుల వివరాలు సేకరిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు జరుగుతుంటే చర్యలు తప్పవు. ఎవరి దగ్గరైనా ఆధారాలు ఉంటే స్వచ్ఛందంగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతాం.
>
> – ఈశ్వర్‌రెడ్డి, విజిలెన్స్ ఎస్పీ

మేనిఫెస్టోనే జగన్‌కు పవిత్ర గ్రంథం



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మండలంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ పేరుతో అన్నదాతలను, డ్వాక్రా మహిళలను టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో వెనుకబడిన కూలాలకు ప్రాధ్యాన్యమిచ్చి బీసీలంటే 'బ్యాక్ బోన్ క్యాస్ట్' అని నిరూపించిన వ్యక్తి జగన్ అని ప్రశంసించారు. సామాజిక న్యాయంలో చంద్రబాబుకు సున్నా మార్కులు వస్తాయని, మోసానికి, వెన్నుపోటుకు ట్రేడ్‌మార్క్ ఆయనేనని పేర్కొన్నారు. శాసనమండలికి 17 మంది వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైతే అందులో 10 మంది బీసీ వర్గాల వారే ఉన్నారని అన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి రాకుండా చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పవన్ స్టాండ్ ఏంటో ఆయనకే తెలియదని, ఎప్పుడు ఎవరు జెండా మోయాలో క్లారిటీ లేదన్నారు. మళ్లీ జగన్ అధికారంలోకి వచ్చి ప్రజారంజక పరిపాలన అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

కరాటే విజేతలకు మంత్రి అభినందన



పతకాలు గెలుపొందిన విద్యార్థులతో మంత్రి ఆర్కే రోజా

నగరి : మూడో ఏషియన్ అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ పోటీలలో విజేతలుగా నిలిచిన తిరుపతి జిల్లా విద్యార్థులను క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా గురువారం తన కార్యాలయం వద్ద అభినందించారు. గోవాలోని శ్రీ మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో గత నెల 29, 30 తేదీల్లో నిర్వహించిన ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో తిరుపతి జిల్లా నుంచి మోక్షిత, తనుయా, గీతిక, ఎం మానస్వి, దీక్షి, కౌశిక్ వర్మ, హేమ సుందరం, గీతిక ప్రతిభ చూపారు. 10 పసిడి పతకాలు, ఆరు వెండి పతకాలను కాటా, కుమటే కరాటే పోటీల్లో కైవసం చేసుకున్నారు. సాధించిన పతకాలతో గురువారం రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రోజాను కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఎఫ్ఎస్ఎస్‌కేఏఐ కరాటే అకాడమీ, రాజగోపాల పురం, సత్యవేడులో కరాటే శిక్షణ పొంది, అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో 7 దేశాలకు చెందిన 2000 మందితో పోటీపడి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం అని ప్రశంసించారు. విద్యార్థులను, కోచ్‌ను అభినందించారు. క్రీడాకారులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

పకడ్బందీగా ఓటరు కార్డుల ప్రక్రియ



మాట్లాడుతున్న డీఆర్‌వో రాజశేఖర్

సాక్షి, చిత్తూరు : రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ ఎపిక్ కార్డుల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో పాల్గొన్న డీఆర్‌వో రాజశేఖర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల కసరత్తులో ఓటర్ ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కసరత్తులో ఓటర్ ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ, కొత్త ఓటర్ల నమోదు, ఫారం 6, 6ఏ, 7, 8, 8ఏ ల స్వీకరణ, అభ్యర్థన, అభ్యంతరాల స్వీకరణ వాటి పరిష్కారం, బూత్ లెవెల్ రిజిస్టర్ల నిర్వహణ కసరత్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. బూత్ లెవెల్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, ఓటర్ కార్డులను పక్కాగా పంపిణీ చేయిస్తామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పద్మజ, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా సర్వేరాళ్లనాటే ప్రక్రియ

జిల్లాల్లో చేపడుతున్న రీసర్వే, సర్వే రాళ్ల నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్న డీఆర్‌వో రాజశేఖర్ వెల్లడించారు. రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులు మరింత వేగవంతంగా చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో రీసర్వే కార్యక్రమం పూర్తి అయిన 134 గ్రామాల్లో సర్వే రాళ్ల నాటుతున్నారన్నారు. ఇప్పటి వరకు 35,199 సర్వే రాళ్ల నాటినట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పలువురు సర్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ కొలువు జగనన్న పుణ్యమే

- 1998 డీఎస్సీ అభ్యర్థులు నియామక ప్రక్రియ పూర్తి
- సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం
- 15 రోజుల్లోపు సంబంధిత ఎంఈవో వద్ద రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం



నియామకపత్రాన్ని అందజేస్తున్న డీఈవో విజయేంద్రరావు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగాలు పొందిన వారు

చిత్తూరు కలెక్టరేట్ : ''ఎట్టకేలకు జగన్ పుణ్యమా అని ఉద్యోగంలో చేరాము.'' అంటూ ఉద్యోగాలు పొందిన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. చిత్తూరు డీఈవో కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం నుంచే పకడ్బందీగా సాగిన ఈ నియామక ప్రక్రియ సాయంత్రానికి ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీలను చూపించి కోరుకునే అవకాశం కల్పించారు. పలు ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో అభ్యర్థులు డీఈవో కార్యాలయానికి విచ్చేయడంతో సందడి నెలకొంది.

533 మందికి ఉద్యోగాలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 533 మంది డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చారు. పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి, అభ్యర్థులు కోరుకున్న ప్రాంతాల్లోనే పోస్టింగులు ఇచ్చారు. డీఈవో విజయేంద్రరావు, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వరరావు సమక్షంలో అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ నెల 12వ తేదీన 350 మందికి గాను 15 మంది గైర్హాజరవ్వగా 335 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఈ నెల 13వ తేదీన 203 మందికి గాను 05 మంది గైర్హాజరవ్వగా 198 మందికి నియామకపత్రాలను అందజేసినట్లు డీఈవో వెల్లడించారు. నియామకపత్రాలు పొందిన అభ్యర్థులు 15 రోజుల్లోపు సంబంధిత ఎంఈవోల వద్ద జాయిన్ రిపోర్ట్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

చిత్తూరు డీఈవో కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 1998 డీఎస్సీ అభ్యర్థుల అసోసియేషన్ సంఘం రాష్ట్ర నాయకులు సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సర్కారు కొలువు ఆశను వదులుకున్న తమకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు. సంతోషంగా ఉద్యోగాల్లో చేరబోతున్నామని వెల్లడించారు. కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మిఠాయిలు పంచిపెట్టారు.

నిద్దరోతున్న నిఘా

- కాణిపాకం ఆలయ భద్రతలో కొరవడిన పర్యవేక్షణ
- సొంత బంధువుల దర్శనాలకే ప్రాధాన్యత
- వరుస సంఘటనలతో విమర్శల వెల్లువ



వీఐపీ పార్కింగ్ వద్ద ఇష్టారాజ్యంగా నిలిపిటున్న వాహనాలు

- స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి మూలవిరాట్ ఫోటోలను రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఫొటోలు తీసి బయటపెట్టారు. ఇది దేవస్థాన భద్రతను, అధికారుల పర్యవేక్షణను, క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థను ప్రశ్నిస్తోంది.
- గతంలో ఓ సినీ నటుడు గన్‌తో ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించారు. అప్పట్లో కొందరు వ్యక్తులు ఆ విషయాన్ని వీడియో తీయడంతో ఘటన బహిర్గతమైంది. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటామనేలోపు నటుడు క్షమాపణ చెప్పడంతో విషయం సద్దుమణిగింది.
- గతంలో ఓ ప్రజాప్రతినిధి గన్‌మన్లు గన్‌లతో లోపలకు రావడాన్ని జర్నలిస్టులు ఫొటోలు తీసేసరికి వారు హుటాహుటిన బయటకు పరుగులు తీశారు.

ఈ సంఘటనలే కాణిపాకంలో నిఘా వ్యవస్థ నిద్దరోతుందనడానికి నిదర్శనం. సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ పర్యవేక్షణ అధికారులు దేవస్థాన పర్యవేక్షణను గాలికొదిలేశారు. చేతివాటానికి అలవాటుపడి నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారు. సొంత బంధువులకు, తమశాఖ అధికారుల పూజలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దేవస్థాన ప్రతిష్టను దెబ్బతీసేలా జరిగిన సంఘటనలపై విమర్శలు గుప్పుమంటున్నా అధికారుల్లో చలనం మాత్రం లేదు.

కాణిపాకం (యాదమరి): కాణిపాకం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడికి నిత్యం వేలాదిమంది భక్తులు స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వస్తుంటారు. జిల్లా వాసులతో పాటు వివిధ రాష్ట్రాలు, దేశ నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. రోజుకు సుమారు 15 వేల నుంచి 20 వేల మంది వరకు భక్తుల తాకిడి ఉంటోంది. ఫలితంగా ఆలయానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఆలయ పర్యవేక్షణ కోసం మొత్తం 85 సీసీ కెమెరాలు ఉన్నాయి. 42 మంది సెక్యూరిటీ సిబ్బంది, ముగ్గురు ఆలయ పర్యవేక్షణ అధికారులు పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ నిఘా వ్యవస్థ పూర్తిగా దారి తప్పింది.

ఉన్నా లేనట్టే..

ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి గేట్ వద్ద ముగ్గురు సిబ్బంది కాపలా కాస్తుంటారు. పర్యవేక్షణ అధికారులు ఆలయం లోపలి భాగంలో తిరుగుతూ ఉంటారు. కొందరు సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ అధికారులు పర్యవేక్షణలో కానీ, విధుల్లో కానీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సొంత విషయాలకు ఇచ్చే ప్రాధాన్యత విధుల్లో చూపించడం లేదు. జేబులు నింపు కోవడంలో ఉన్నట్టువంటి శ్రద్ధ ఆలయ భద్రతపై లేదనే ఆరోపణలున్నాయి. గత వారంలోను నిత్య అన్నదానం దగ్గర సీసీ కెమెరాలు లేకపోవడంతో సరుకులు చోరీకి గురైన విషయం తెలిసిందే. రోజుకు కనీసం రూ.1000 నుంచి రూ. 5000 వరకు సరుకులు పట్టుకెళ్లాలనే ప్రయత్నంలో ఉంటున్నారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని టార్గెట్ చేసి దర్శనం దగ్గరుండి చేయిస్తుంటారు. ఏకంగా మూలస్థానంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయిస్తారు. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.1000 నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ సమయంలో గేట్ల వద్ద, చెకింగ్ పాయింట్ వద్ద భద్రత వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. సెల్‌ఫోన్లు...కెమెరాలతో సహా అట్టే లోపలికి తీసుకెళ్లిపోతున్నారు. ఈ దందాతోనే ఆలయ భద్రతకు భంగం వాటిల్లుతోంది.

భద్రత లోపాలు ఇవే.

- ఆలయం వద్ద సెక్యూరిటీ నిర్లక్ష్యంగా ఉండడంతో వాహనాలు పార్కింగ్‌లో కాకుండా ఆలయం ముందు వీఐపీ పార్కింగ్‌లో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.
- అర్థ మండపం వద్ద సెక్యూరిటీ, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ కెమెరాలలో మూలవిరాట్‌ను బంధించి సోషల్ మీడియాలో పెట్టారు.
- సీసీ కెమెరాలు లేనందున నిత్య అన్నదానంలో సిబ్బందే సరుకులను యథేచ్ఛగా తీసుకెళ్లారు.
- ఆలయ నిబంధనలపై అవగాహన కల్పించేలా అధికారులు బోర్డులు పెట్టడం లేదు.
- సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో సిబ్బందిలో నిర్లక్ష్యం తాండవిస్తోంది.

> **మూడు ప్రదేశాల్లో తనిఖీలు**
>
> 
>
> ఇకపై ఆలయంలో మూడు ప్రదేశాల్లో భక్తులను తనిఖీలు చేస్తాం. వీఐపీ గేట్‌లో వచ్చే భక్తులకు మొదటి గేట్ వద్ద, ఆలయంలోకి రాగానే, ఉత్తర మార్గంలో వెళ్లే గేట్‌లో ఖచ్చితంగా తనిఖీలు చేస్తాం. రూ.150, రూ.100, ఉచిత క్యూలలో వచ్చే భక్తులకు ప్రవేశ ద్వారం వద్ద, ఆలయంలోకి రాగానే శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ముందు తనిఖీలు చేస్తాము. సెల్‌ఫోన్‌లతో లోనికి వచ్చినట్లు తెలిస్తే సిబ్బందిపైన తగు చర్యలు తీసుకొని, వారిని బయటకు పంపేస్తాం. సెల్‌ఫోన్‌లు పెట్టడానికి నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశాం.
>
> – వెంకటేశు, ఆలయ ఈఓ, కాణిపాకం

9 శతాబ్దాల తిరుపతి జాతర

చిత్తూరు కలెక్టరేట్ : తొమ్మిది శతాబ్దాల చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో తిరుపతి జాతర విశిష్టతను పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మేలో తిరుపతి తాతయ్యగుంట జాతరను ఘనంగా నిర్వహిస్తారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. మే లో ఏడు రోజుల పాటు ఘనంగా నిర్వహించే జాతరను రాష్ట్ర పండుగలా ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు గాను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేసిన కృషి ఫలించింది. రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు తిరుపతి వాసులు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ నిజాయితీ



నగదు బ్యాగును వృద్ధురాలికి అందజేస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: పుత్తూరుకు చెందిన ఆటో డ్రైవర్ కైలాసం తన ఆటోలో ఎవరో వదలి వెళ్లిన బ్యాగ్‌ను అందులోని రూ.50 వేలు, ఒక సెల్ ఫోన్‌ను స్థానిక పోలీసులకు అందజేసి తన నిజాయితీని చాటుకొన్నాడు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు, గురువారం ఉదయం నారాయణవనం నుంచి కె.కస్తూరి(70) పుత్తూరుకు ఆటోలో వచ్చింది. పూల మార్కెట్ వద్ద దిగి వెళ్లిపోయిన వృద్ధురాలు బ్యాగ్ పోగొట్టుకొన్న విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. కొంత సేపటికి ఆటో డ్రైవర్ బాలయ్య, తన సహచర ఆటో డ్రైవర్ కైలాసంతో కలిసి వెళ్లి పోలీసులకు బ్యాగ్‌ను అందజేశాడు. అందులోని నగదు, సెల్‌ఫోన్‌ను వృద్ధురాలికి అందించారు. ఆటో డ్రైవర్ బాలయ్యను సీఐ అభినందించారు.

ఫొటో తీసిన వ్యక్తిపై కేసు నమోదు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గర్భాలయాన్ని ఫొటో తీసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాణిపాకం ఇన్‌చార్జ్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆలయంలో స్వామివారి ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వ్యక్తిపై ఆలయ ఈఓ వెంకటేశు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. సీసీ పుటేజీలు పరిశీలించి అతడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

లాభాల బాటలో ఆర్టీసీ

ఆర్టీసీ ప్రస్తుతం లాభాల బాటలో దూసుకెళుతోంది. కోవిడ్ సమయంలో తీవ్ర నష్టాలు చూసింది. ఆ తరువాత నష్టాలను అధిగమించేందుకు ఆదాయ అన్వేషణ మార్గాలను వెతికింది. ప్రయాణికులకు అనుకూల మార్గాల్లో అవసరమైన బస్సులను తిప్పింది. ఆదాయం వచ్చే పల్లెలకు బస్సులు పరుగులు తీశాయి. ప్రణాళికాబద్ధంగా బస్సులు నడుపుతోంది. మరో వైపు కార్గో నుంచి ఆదాయం గడించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. క్రమంగా ఆదాయం పెరగసాగింది. ఫలితంగా గత సంవత్సరం కంటే ఈ సారి అధిక ఆదాయం సమకూరింది.



- 2022-23లో పెరిగిన ఆదాయం
- ప్రణాళికతో బస్సులు నడిపిన అధికారులు

ఆదాయం ఇలా ..

సంవత్సరం	తిరిగిన కి.మీ.	ఆదాయం (కోట్లలో)	కార్గో ఆదాయం
2021-22	400.78 లక్షలు	112.00	2.8 కోట్లు
2022-23	552.28 లక్షలు	196.59	4.07 కోట్లు

చిత్తూరు రూరల్: ఆర్టీసీ నష్టాల సుడిగుండం నుంచి గట్టెక్కే సమయంలోనే కోవిడ్-19 పంజా విసిరింది. మూలిగే నక్కమీద తాటికాయ పడినట్లు ఆర్టీసీ మరింత డీలా పడిపోయింది. బస్సులను తిప్పకుండా, డిపోలకు పరిమితం చేశారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం పూర్తిగా పడిపోయింది. 2021లో కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో నిబంధనల్లో సడలింపు నిచ్చారు. ఆపై 10 శాతం బస్సులను నిబంధనల మేరకు రోడ్లపైకి తీసుకొచ్చారు. కోవిడ్ పూర్తిగా తగ్గడంతో ఆర్టీసీకి ఊపిరొచ్చింది. పూర్తిస్థాయిలో బస్సులను నడిపేందుకు అవకాశం లభించింది. అవసరమైన ప్రాంతాల్లో కావాల్సినన్ని బస్సులు తిరగడం మొదలెట్టాయి. ఇలా 2022 మార్చి వరకు సాగింది. ఆ తరువాత పల్లె పల్లెకూ బస్సు తిరగడం ప్రారంభమైంది. ఆ ప్రకారం ముందస్తు సర్వే చేసి ఆదాయం వచ్చే పల్లెలకు వెలుగు బస్సులను పంపించారు. పలు రాయితీలను అమలు చేసి ప్రయాణికులను ఆకట్టుకునేలా చేస్తున్నారు. జిల్లాలో 5 డిపోల పరిధిలో 376 బస్సులు ఉన్నాయి. ఇవి రోజుకు 2,525 ట్రిప్పులు నడవగా, 1.58 లక్షల కి.మీ. తిరుగుతున్నాయి. ఈ బస్సుల్లో 1,08,986 ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో దినసరి ఆదాయం ఆర్టీసీకి రూ.56 లక్షల వరకు వస్తోంది.

ప్రైవేటుకు దీటుగా...

ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రైవేటు బస్సులతో పోటీ పడాలంటే చాలా కష్టం. అది కాకుండా ఆటోలు, క్యాబ్‌లు సైతం పుట్టుకొస్తున్నాయి. చాలా మంది లగ్జరీ ప్రయాణాన్ని, తక్కువ సమయంలో గమ్యం చేరుకునే మార్గాన్ని కోరుకుంటున్నారు. ఈ తరుణంలో ఏసీ బస్సులు, స్లీపర్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. కొంత మంది క్యాబ్‌లు బుక్ చేసుకుంటున్నారు. వీటన్నింటితో ఆర్టీసీ పోటీ పడుతోంది. హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు ఏసీ బస్సులను రంగంలోకి దింపింది. ఇటీవల స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రైవేటు చార్జీల కంటే తక్కువగా వసూలు చేస్తూ, ఈ సర్వీసులను నడుపుతోంది. సందర్భానికి అనుగుణంగా ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. తిరుమల బ్రహ్మోత్సవాలు, కాణిపాక బ్రహ్మోత్సవాలు, సంక్రాంతి, గంగజాతర, దీపావళి, వినాయకచవితి, రంజాన్, తిరువణ్ణామలైలో జరిగే గిరి ప్రదక్షిణ, ఆడికృత్తిక, క్రిస్మస్ వంటి పండుగలకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇక ప్రతి శుక్ర, శని, ఆది, సోమవారాల్లో బెంగళూరుకు ప్రత్యేక బస్సులను తిప్పడం పరిపాటిగా చేసుకుంది. గత ప్రభుత్వంలో ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు బాదుడు ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం ఆ బాదుడుకు చెక్ పెట్టింది. మరమ్మతులకు గురైన బస్సులను ఎప్పటికప్పుడు బాగు చేయిస్తున్నారు. బస్సులకు రంగులు వేయడం, శుభ్రపరచడం వంటి పనులు చేస్తున్నారు. డిపోల వారీగా ఆదాయ.. వ్యయాలపై అంచనా వేసి డిపో మేనేజర్లతో సమీక్ష నిర్వహిస్తూ..ఇవన్నీ వెరసి ఆర్టీసీ ఆదాయానికి ఫలితాలను తెచ్చి పెడుతున్నాయి.

బస్సుల వివరాలు...

మొత్తం డిపోలు	-	5
మొత్తం బస్సుల సంఖ్య	-	371
ఎక్స్‌ప్రెస్‌లు	-	98
సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు	-	17
అల్ట్రా డీలక్స్	-	01
సూపర్ లగ్జరీ	-	30
ఇంద్ర	-	02
అద్దెబస్సులు	-	59
పల్లెవెలుగు	-	164

ప్రణాళికలు ఫలిస్తున్నాయి



కరోనా సమయంలో ఆర్టీసీ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయింది. ఆ నష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ప్రణాళిక ప్రకారం బస్సులు నడిపే ప్రయత్నం చేస్తున్నాం. రాయితీలు ఫలిస్తున్నాయి. బల్క్ బుకింగ్ ఉంటే గ్రామానికే బస్సులను పంపిస్తున్నాం. అలాగే పెళ్లిళ్లకు కూడా బస్సులను ఇస్తున్నాం. ఇలా పలు రకాలుగా ఆర్టీసీ బస్సులను వినియోగిస్తూ ఆదాయం పెంచేలా చూస్తున్నాం. ఇలా చేయడం ద్వారా ఈ సారి ఆదాయం బాగానే ఉంది. ఇదే స్పీడుతో ముందుకెళ్లేలా అధికారులను సూచనలు ఇస్తున్నాం.

-జితేంద్రనాథ్‌రెడ్డి, డీపీటీఓ, చిత్తూరు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యాదమరి: మండలంలోని జంగాపల్లె రెవెన్యూ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. జంగాపల్లె సమీపంలోని పంట పొలాల్లో వ్యక్తి శవం ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉండడంతో శవం కుళ్లిపోయింది. స్థానికులను విచారించగా, అతని దుస్తులు చూసి యాచకుడిగా గుర్తించినట్లు తెలిపారు. దీనిపై పంచాయతీ అధికారుల వద్ద ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

25న వాక్ ఇన్ సెలక్షన్ మేళా

తిరుపతి తుడా: వివిధ ఉద్యోగాలకు ఈనెల 25వ తేదీన వాక్ ఇన్ సెలక్షన్ మేళాను నిర్వహించనున్నట్లు శ్రీలక్ష్మి శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. టీటీడీ శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్ హాస్పిటల్ సిబ్బంది పోస్టుల భర్తీకి మేళా నిర్వహిస్తున్నట్లు వివరించింది. అభ్యర్థులు ఆరోజు మధ్యాహ్నం లోపు ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపింది. ఇతర వివరాల కోసం http://slsmpc.in ను సంప్రదించాలని సీఈఓ శేష శైలేంద్ర తెలిపారు.

16న విశ్వంలో ఉచిత నమూనా పాలిసెట్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు నమూనా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్)ను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత విశ్వనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10వ తేదీన రాష్ట్రస్థాయిలో నిర్వహించే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్షను నిర్వహిస్తామని, పరీక్ష అనంతరం పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ ఉచిత నమూనా ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సాగుకు పెట్టుబడి సాయం

వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయనుంది. 2023-24 సంవత్సరానికి గాను పంటల వారీగా రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రైతులు పంట రుణాలు పొందవచ్చు. జిల్లా వ్యాప్తంగా కిసాన్ క్రెడిట్ కార్డులకు అర్హులైన రైతులను గుర్తించారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు.



- 2023-24లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు
- మే నుంచి ఖరీఫ్, అక్టోబర్ నుంచి రబీ రుణాలు మంజూరు
- జిల్లాలో అర్హులైన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు
- సకాలంలో రుణాలు చెల్లిస్తే పూర్తి స్థాయి వడ్డీ రాయితీ

తిరుపతి రూరల్: పంటల వారీగా రుణ పరిమితి ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేయడంతో మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా, అక్టోబరు నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణ ప్రణాళిక అమలు చేయనున్నారు. ఏడాది కార్యాచరణ ప్రణాళికను లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఏ పంటకు ఎంత రుణం ఇవ్వాలనే విషయమై నివేదిక రూపొందించారు. ఈ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపగా, అక్కడ ఆయా పంటలకు రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఏడాదికేడాది పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు పెరుగు తుండడంతో దాన్ని పరిగణలోకి తీసుకున్నారు. పంట రుణ పరిమితిని ఎకరాకు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేయనున్నాయి.

కిసాన్ క్రెడిట్ కార్డులు

అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అర్హులైన రైతులను గుర్తించారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచికత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు. అందుకు కేవలం 7శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తారు. ఏడాది లోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. రూ.లక్ష లోపు రుణం ఏడాదిలోగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 4శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి పూర్తిస్థాయిలో మినహాయింపు పొందే అవకాశం ఉంది.

అర్హులైన రైతులందరికీ రుణం



జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణం అందజేయడమే లక్ష్యంగా రుణ ప్రణాళిక తయారు చేశాం. కిసాన్ క్రెడిట్ కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా అర్హులైన రైతులను గుర్తించాం. రుణం ఏడాదిలోగా చెల్లిస్తే వడ్డీ కట్టాల్సి న అవసరం ఉండదు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని ఇబ్బందులు పడకుండా...బ్యాంకులో రుణాలు తీసుకుని వడ్డీ రాయితీ పొందాలి. ఈమేరకు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సుభాష్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, తిరుపతి జిల్లా

ఏటిగడ్డ వద్ద ఒంటరి ఏనుగు హల్‌చల్



ఏనుగు ధ్వంసం చేసిన ఫెన్సింగ్



మదపుటేనుగు నాశనం చేసిన వరిపంట

పలమనేరు: మండలంలోని ఏటిగడ్డ గ్రామ సమీపంలోని పంటపొలాలపై ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి హల్‌చల్ చేసింది. గ్రామ సమీపంలోని పుష్పరాజ్ పొలానికి రక్షణగా వేసుకున్న సోలార్ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి మామిడి చెట్ల కొమ్మలను విరిచేసింది. అనంతరం పొలం వద్ద కాపురముంటున్న అమరావతమ్మ ఇంటి కిటికీలను ధ్వంసం చేసి ఇంటిలోకి వెళ్లి అక్కడున్న బస్తాలను తొక్కి ధాన్యాన్ని ఆరగించింది. మదపుటేనుగు ఘీంకారాలతో పశువుల కొట్టంలోని పశువులు తాళ్లు తెంపుకొని పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాయి. ఆపై దామోదర్ సాగు చేసిన వరిపంటను తొక్కినాశనం చేసింది. పొలాల వద్ద కాపురాలున్న రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన ఎలిఫెంట్ ట్రాకర్స్ ఒంటరి ఏనుగును అడవిలోకి మళ్లించారు.

గణనాథుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం(యాదమరి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి గురువారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వదించి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి కూడా గురువారం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు.



జస్టిస్ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

నగరి : మండలంలోని గుడికంబ్రిగ గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు వీకేఆర్ ఎస్సీ కాలనీకి చెందిన దిలీప్ (20)ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కుమార్(25)ను నగరి బస్టాండు నుంచి ఎక్కించుకొని బుధవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గుడికంబ్రిగ వద్ద చెన్నై నుంచి తిరుపతి వైపుగా వెళుతున్న ఈచర్ లారీ ఆటోను ఢీ కొంది. దీంతో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. వీరిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం దిలీప్ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.